ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమే.!


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఆవు

దుండిగల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ మూగ ప్రాణం బలైంది. సోమవారం దుండిగల్ తాండాలోని జగదాంబ ఆలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఆవు పాలతోనే జగదాంబ అమ్మవారికి ప్రతి నిత్యం అభిషేకం నిర్వహిస్తు ఉంటారు. ఆవు మృతి చెందడంలో ఆలయ పూజారి విద్యుత్ అధికారుల తీరుపై మండిపడ్డారు. గతంలో ఇదే ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో చెత్తను పారబోసే క్రమంలో ఓ యువతికి షాక్ తగిలి స్పృహ కోల్పోయిందన్నారు. అప్పట్లో ఫిర్యాదు అందుకున్న ఏఈ వచ్చి చూసి వెళ్లారే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం


దుండిగల్ 10వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ నవిత

దుండిగల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ డీపోచంపల్లి కౌన్సిలర్ నవిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం దుండిగల్ 10వ వార్డులోని కృష్ణనగర్, సత్యసాయినగర్, శంకర్ నగర్‌లలో రూ.23 లక్షలు, 7వ వార్డులోని గణేష్‌నగర్‌లో రూ.4 లక్షలు మొత్తం 27 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


గాంధీనగర్ రోడ్ నం. 7లో పూడ్చకుండా వదిలేసిన భారీ గుంత


గాంధీనగర్‌లోని రోడ్ నం. 2 ముఖద్వారంలో ఇలా..


విజయనగర్ కాలనీలో పైపులైన్ వేసి పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

ఇష్టానుసారంగా పనులు

● కాంట్రాక్టర్లపై లేని అధికారుల నియంత్రణ ● తవ్విన గుంతలను పూడ్చని వైనం ● ఇబ్బందులు పడుతున్న స్థానికులు


నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు


గాంధీనగర్ రోడ్ నం. 3లో ధ్వంసమైన కల్వర్ట్ శ్లాబ్

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా పనులు పూర్తి చేస్తున్నారు.దీంతో పనులు చేపట్టే సమయంలో రోడ్లపై తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.జలమండలి ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్,విజయనగర్ కాలనీ, నందానగర్ తదితర ప్రాంతాల్లో మూడు వారాల క్రితం భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టి పూర్తి చేశారు.

◆ అయితే పైపులైన్‌లు వేసిన సదరు కాంట్రాక్టర్ మ్యాన్‌హోళ్లను నిర్మించి తూతూ మంత్రంగా గుంతలను పూడ్చి చేతులు దులుపుకున్నాడు. దీంతో ఆయా గల్లీల వాసులు ఇళ్ల ముందే గోతులు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదిస్తే ఇదిగో చేయిస్తాం.. అదిగో వస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీ లైన్లతో నిక్షేపంలా ఉన్న రోడ్లను ధ్వంసం చేసి తమకు కొత్త తలనొప్పులు సృష్టిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.

రోడ్డు మధ్యలో పెద్ద గుంత..

గాంధీనగర్ రోడ్ నం.7లో పైపులైన్‌లు వేసే క్రమంలో తీసిన గుంతను కాంట్రాక్టర్ అలాగే వదిలేశాడు. సుమారు నాలుగు ఫీట్ల మేర లోతున్న గుంతతో ఆ గల్లీ వాసులు గత ఇరవై రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు మొదలుకుని, ఏదైనా ఆటో గల్లీలోకి రాలేని పరిస్థితి నెలకొంది. ఇంటి ముందే భారీ గుంత ఉండటంతో తమ చిన్నారులు ఎక్కడ అందులో పడి గాయాల పాలవుతారనే ఆందోళనలో స్థానికులు ఉన్నారు.

కల్వర్ట్ ధ్వంసం.. నిలిచిన మురుగు..

గాంధీనగర్ రోడ్ నం.3లో పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న కల్వర్ట్ పైకప్పును కాంట్రాక్టర్ పగులగొట్టి పనులు పూర్తి చేశాడు. దీంతో గాంధీనగర్ ప్రధాన రహదారి నుంచి భగత్‌సింగ్‌నగర్ ప్రధాన నాలాకు అనుసంధానంగా ఉన్న డ్రైనేజీ లైన్ పూడుకుపోవడంతో మురుగునీరు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. పనులు పూర్తయ్యాక కల్వర్ట్ పైకప్పును పునరుద్ధరిస్తామన్న అధికారులు ఆపై చడీచప్పుడు చేయకపోవడంతో స్థానికంగా దుర్గంధం పేరుకుపోతోంది. రోడ్డులో సైతం సరిగా మట్టిని వేసి గుంతలను పూడ్చలేదు.

ఇతర గల్లీల్లో ఇదే తీరు..

విజయనగర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని గల్లీలో, గాంధీనగర్ రోడ్ నం.2లలో సైతం భూగర్భ డ్రైనేజీ పైపులు వేసి, మ్యాన్‌హోళ్లను నిర్మించినా గుంతలను సరిగా పూడ్చకపోవడంతో ఆయా గల్లీల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకెన్నాళ్లు తమకు ఈ రోడ్డు కష్టాలంటూ స్థానికులు తలలు పట్టుకుంటున్నారు.

అధికారులు చెప్పినా చేయడం లేదు..



మా గల్లీలో పనులు చేసే సమయంలో కల్వర్ట్ పైకప్పు ధ్వంసమైంది. ఈ విషయమై జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. నాలాలో నిర్మాణ వ్యర్థాలు పూడుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. కల్వర్ట్ శ్లాబ్ శిథిలమైన ప్రాంతంలో రోడ్డు చిన్నదిగా ఉండటంతో సమీప ఇళ్ల వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కల్వర్ట్ శ్లాబ్‌ను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించండి.

– అహ్మద్‌లాలు, గాంధీనగర్ గల్లీ నివాసి

అధికారంలో లేకున్నా సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను నివేదించారు. దీనిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో ఫోన్లల్లో మాట్లాడి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో నిజాంపేట్ బీజేపీ నేతల ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నం.233/1లో మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని, ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్న ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బాచుపల్లికి మంజూరైన 33/11 కెపి సబ్ స్టేషన్‌కు 2వేల గజాల ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. అదే విధంగా ఏడీఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. వీఎన్ఆర్ కాలేజీ పక్కన రెండు ఎకరాల పార్కు స్థలాన్ని అక్రమ పద్ధతిలో స్వాధీనం చేసుకున్న వారిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌రావు, కౌశిక్ నాయుడు, కొంకి రాము, ఈశ్వర్‌రెడ్డి, మాధవరావు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన జ్యోతి స్కూల్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డును అందుకుంటున్న కొడాలి విజయరాణి

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌కు 'ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023' లభించింది. డిసెంబర్ 17న బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి అవార్డును అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 4వేల పాఠశాలలను గుర్తించినప్పటికీ అందులో కేవలం 60పాఠశాలలకు మాత్రమే వివిధ విభాగాల్లో అవార్డులు లభించాయని ఆమె తెలిపారు. అందులో తమ పాఠశాల ఉండటం సంతోషంగా ఉందన్నారు.

రామయ్య ఆలయానికి
అయోధ్య అక్షితల కలశం



నిజాంపేట్: ప్రగతినగర్ పట్టాభి రామాంజనేయస్వామి దేవస్థానానికి అయోధ్య రామమందిర అక్షింతలు సోమవారం చేరాయి. ఈ అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ప్రగతినగర్ సంచాలన సమితి సభ్యుడు పట్టాభి రామాంజనేయ స్వామి దేవస్థానానికి చేర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి, కమిటీ సభ్యుల సమక్షంలో అక్షింతలు ఉన్న కలశానికి పూజలు చేసి శ్రీరాముని సన్నిధిలో భద్రపరిచామన్నారు.సంచాలన సమితి ద్వారా వీటిని జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి హిందూ కుటుంబానికి ఇంటింటికీ వెళ్లి అక్షింతలతో పాటు అయోధ్య రామాలయం చిత్రపటం, కరపత్రం అందజేస్తామని తెలిపారు.

వైభవంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసారు. అలాగే ఈనెల 23వ తేదీన వైకుంట ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, వచ్చేనెల 14వ తేదీన గోదాదేవి, గోవిందరాజస్వామి ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మధ్య కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు హరిపురి నరహరి తెలిపారు.


ఆలయంలో గోవిందరాజ స్వామి

సర్వే నం.191లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని సర్వే నం .191లో సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొంత కాలంగా నిజాంపేట్‌లోని సర్వే నం.191లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు సోమవారం తహసీల్దార్ పూల్‌సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీస్ బందోబస్తు మధ్యలో వెలసిన గదులను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తహసీల్దార్ కబ్జాదారులకు హెచ్చరించారు. అదే విధంగా ప్రైవేటు స్థలమని బారికేడ్లు ఏర్పాటు చేసుకున్న వాటిని సైతం అధికారులు కూల్చివేశారు.కబ్జాదారులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు అవాక్కయారు. మరోసారి ఇలాంటి నిర్మాణాలు చేపడితే కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే గెలిచాను


ఎమ్మెల్యే వివేకానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రాజిరెడ్డి

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల సమష్టి కృషితోనే అసెంబ్లీ ఎన్నికల్లో తాను 85వేల పైచిలుకు భారీ మెజార్టీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం దుండిగల్ మున్సిపల్ పరిధి బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాలులో వివేకానంద్ కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. చారిత్రాత్మక విజయాన్ని తనకు అందించిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి గుర్తించుకుంటానని తెలిపారు. అందరి సమష్టి కృషితో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పరుస్తానన్నారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని శక్తిగా నిలబెట్టిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: జలమండలి ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డిని సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జలమండలి ఎండీగా పనిచేసిన దాన కిషోర్ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా నూతన నిర్మించిన సెక్రటేరియట్ కార్యాలయంలో వారిని కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్తకుంట చెరువును కబ్జా చెర నుంచి కాపాడాలి


జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్

సుభాష్‌నగర్: గాజులరామారం శ్రీకృష్ణనగర్‌లోని కొత్తకుంట చెరువును కబ్జా చెర నుంచికాపాడాలని సోమవారం ప్రజావాణిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు కొత్తకుంట చెరువున పూడుస్తున్న విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించ లేదన్నారు. రెవెన్యూ అధికారుల వైఖరి కబ్జాదారులకు పరోక్షంగా మద్దతు తెలుపుతున్నట్లుగా ఉందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని ఆయన కోరారు.

కార్లలో కబ్జాదారుల షికార్లు
రోడ్డు మీద పడ్డ బాధితులు

ఈ పాపం ఎవరిది? రెవెన్యూ అధికారులదా.. పోలీసులదా?

2నెలలుగా ఫిర్యాదులు.. ఏక కాలంలో కూల్చివేతలు

- ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు
- అధికారుల అకస్మిక దాడితో కంగుతిన్న కబ్జాదారులు
- లబోదిబోమంటున్న వందలాది మంది అమాయకులు


గాజులరామారం సర్వే నం.342లో ఇటీవల కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

కుత్బుల్లాపూర్: సైలెంట్ ఎంత వైలెంట్‌గా ఉంటుందో చూపించాడు కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రహమాన్. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని గడిచిన రెండు నెలల కాలంలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఒక్కో ఫిర్యాదును స్వీకరిస్తూ వచ్చిన ఆయన ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక్కసారిగా పంజా విసరడంతో కబ్జాదారులు ఒక్కసారిగా కంగుతిన్నారు. వారి వద్ద లక్షలు పెట్టి ఈ స్థలాలు కొన్న వందలాదిమంది అమాయకులు రోడ్డుపాలయ్యారు.

◆ ఈనెల 16 శనివారం రోజు గాజులరామారం సర్వే నం. 307, 329/1, 342 ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను ఆరు బందాలుగా విడిపోయి ఎక్కడికక్కడే కూల్చివేతలు చేపట్టిన విషయం తెలిసిందే. స్థలాలు అమ్మి సొమ్ము చేసుకున్న వారు దర్జాగా ఖరీదైన కార్లల్లో తిరుగుతుండగా వాటిని కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు.

◆ **కూల్చివేతలు సరే.. కబ్జాదారులపై చర్యలేవి?**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టి కోట్లు సంపాదించిన కబ్జాదారులపై పిడికిలి బిగించాల్సిన బాధ్యత సంబంధిత పోలీస్ అధికారులపై ఉంది. కానీ ఇక్కడ మండల తహసీల్దార్ ఫిర్యాదు చేసిన స్థానిక పోలీసు అధికారులు మాత్రం వారిపై కఠినంగా వ్యవహరించకపోవడం మూలంగా ప్రభుత్వ స్థలాలు కొన్న అమాయకులు మోసపోతున్నారు. దీంతో కబ్జాదారులు రెచ్చిపోయి ప్రభుత్వ స్థలాలను స్వాహా చేస్తున్నారు.

◆ **కబ్జాదారులపై పదుల సంఖ్యలో కేసులు..**

ఇటీవల అధికారులు కూల్చివేసిన ప్రాంతంలో గతంలో కూడా కూల్చివేతలు చేపట్టారు. ఇక్కడ కబ్జాదారులపై ఒక్కొక్కరిపై దుండిగల్, సూరారం, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ల పరిధిలో పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడం విశేషం. ఇంత జరుగుతున్నా వీరిపై ×పిడి℃కిలి బిగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వస్తున్నారన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

◆ **విచారణ పేరుతో డబ్బులు వసూలు!**

అంతేకాకుండా రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగానే కబ్జాదారులను స్టేషన్‌కు పిలిపించి వారితో బేరసారాలకు దిగి అందిన కాడికి దండుకుంటున్నారన్న ప్రధాన ఆరోపణ ఉంది.పోలీసులతో పాటు ఎస్ఓటీ పోలీసులు సైతం ఇందులో తలదూర్చి విచారణ పేరిట కబ్జాదారులను స్టేషన్‌కు పిలిపించి వారి వద్ద ఫోన్లు లాక్కొని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని కబ్జాదారులే బహిరంగంగా చర్చించుకోవడం విశేషం.

◆ **అక్రమ నిర్మాణాల వెనుక అధికారులు, పోలీసుల పాత్ర**

ఏది ఏమైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల వెనుక రెవెన్యూ అధికారుల పాత్ర ఎంత ఉందో పోలీసుల పాత్ర కూడా అంతే ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేయగానే వారిపై కఠినంగా వ్యవహరిస్తే మరోసారి కబ్జాలు చేయకుండా భయపడే ఆస్కారం ఉంది. కానీ పోలీసులే భూ కబ్జాదారులకు ×భరోసా℃ఇస్తున్నారన్న విమర్శ ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తాం

● సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు
● కొత్త ప్రభుత్వమైనా బకాయిలు ఇప్పించాలని వేడుకోలు

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని కార్మిక నాయకులు ప్రాధేయపడుతున్నారు. ఇంటర్నేషనల్ పరిశ్రమగా పేరుగాంచిన సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ నిర్దాక్షిణ్యంగా 1000 మంది కార్మికులకు అన్యాయం చేసి పరిశ్రమను మూసివేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. కాగా గత 19నెలలుగా కార్మికులకు జీతాలు లేక వారి కుటుంబాలు ఆర్థికంగా చిక్కిపోయాయి. దీంతో కుటుంబాలను పోషించుకోలేక కార్మికులు ఏదో చిన్న ఉద్యోగాల్లో చేరి పనులు చేసుకుంటుండగా మరికొంత మంది సెక్యూరిటీ గార్డులుగా చేస్తున్నారు.

గత ప్రభుత్వం మాకు ఎలాంటి సహాయం చేయలేదు..

పరిశ్రమ మూసేసినప్పటి నుంచి కార్మికులు పరిశ్రమ ఆవరణలో రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. అప్పటి బీఆర్ఎస్ నాయకులు వచ్చి మమ్మల్ని పలకరించి వెళ్లారన్నారు. ప్రభుత్వం తరపున పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి తమకు చెల్లించాల్సిన బకాయిలు ఇప్పించలేదని వాపోయారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని కార్మికులకు తగిన న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

◆ గతంలో మాకు ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లభించలేదు. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ బాధలు చెప్పుకుంటామని కార్మికులు అంటున్నారు. ప్రభుత్వ పెద్దలు నాయకులు పట్టించుకుని పరిశ్రమ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన రూ.120కోట్ల గ్రాంటులను ఇప్పించాలని కార్మికులు కోరుతున్నారు. కార్మికుల చట్టాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.


రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న కార్మికులు

ముగిసిన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవం


ప్రత్యేక అలంకరణలో సమయపురం మారమ్మ



జగద్గిరిగుట్ట: భూదేవిహిల్స్‌లో సమయపురం మారమ్మ దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ముగిసాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త రామకృష్ణతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహ ఆవిష్కరణ ఎప్పుడు?


కొత్తగా ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ విగ్రహం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలో ఇందిరా గాంధీ విగ్రహం 6 నెలల క్రితం ఓ టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమయ్యింది. దీనికి కారణమైన వ్యక్తులు ఒక నెలలోపే తిరిగి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాగా 3 నెలలు క్రితమే ఏర్పాటు చేసినా ఎన్నికల కోడ్ ఉండటంతో విగ్రహాన్ని ఆవిష్కరించలేదు. ప్రారంభించలేదు. కోడ్ ముగిసి చాలా రోజులైనా ఇప్పటి వరకు విగ్రహాన్ని ఆవిష్కరించకపోవడం గమనార్హం.